క్లుప్తంగా...

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

కాప్రా: విద్యుత్ మరమ్మతుల కారణంగా సైనిక్‌పురి సబ్‌స్టేషన్ పరిధిలోని పలు కాలనీలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జనప్రియ ఫీడర్ పరిధిలోని గ్రీన్‌పార్క్ ఎన్‌క్లేవ్, మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు హైటెన్షన్ ఫీడర్ పరిధిలోని గ్రీన్‌పార్క్, రాందాస్‌నగర్, ప్రశాంత్‌నగర్, సాయిలీలా ఎన్‌క్లేవ్, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు శాలివాహన ఎన్‌క్లేవ్, ఎల్లారెడ్డిగూడ, కాప్రా, అశోక్ కాలనీ, కాప్రా తహసీల్దార్ కార్యాలయ ప్రాంతంలో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

సీఎం కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి



హబ్సిగూడ: ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి గురువారం అసెంబ్లీలో సీఎం కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. రైతు రుణ మాఫీ ప్రారంభం అవుతున్న నేపథ్యంలో ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



పిల్లలకు టీకా మందు వేస్తున్న కార్పొరేటర్ రమా వెంకటేశ్‌యాదవ్

బోడుప్పల్: ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని 24వ డివిజన్ కార్పొరేటర్ గుర్రాల రమా వెంకటేశ్‌యాదవ్ అన్నారు. డివిజన్ పరిధిలోని బయన్నగూడ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం ఆమె ప్రాథమిక వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్న పిల్లలకు టీకాలు సకాలంలో వేయించాలని, కండ్ల కలకలు, ఇన్సులేషన్స్, అనారోగ్యం సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే డాక్టర్లను సంప్రదించాలన్నారు. సీజనల్‌గా వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. స్థానికులు ఈ ప్రాథమిక వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

హోర్డింగ్ తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలి

బోడుప్పల్: హోర్డింగ్ తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ రాపోలు ఉపేందర్ గురువారం మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రాపోలు ఉపేందర్, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 2వ తేదీన రాపోలు ఉపేందర్ తన పుట్టిన రోజును పురస్కరించుకుని హోర్డింగ్ ఏర్పాటు చేసుకున్నారు. ఆ హోర్డింగ్‌ను తొలగించి దానిస్థానంలో బోడుప్పల్ మేయర్ బుచ్చిరెడ్డి, వారి కుమారుడు మనోహర్‌రెడ్డి వారి హోర్డింగ్‌ను ఏర్పాటు చేసుకున్నారు. తమ మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. తొలగించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు వెల్లడించారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం



అవగాహన సదస్సులో రాజకీయ పార్టీల ప్రతినిధులు

బోడుప్పల్: అసెంబ్లీ ఎన్నికల సన్నద్ధంలో భాగంగా గురువారం బోడుప్పల్ కమిషనర్ జి. వేణుగోపాల్‌రెడ్డి నగర పాలక సంస్థ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు లిస్టులో మార్పులు, చేర్పులు, సవరణలు కాలనీ రెసిడెంట్స్ అసోసియేషన్ల ద్వారా సత్వరమే ఆన్‌లైన్ ద్వారా చేపడతామన్నారు. దీనికి కాలనీ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు సహకరించాలని ఆయన కోరారు. ముందస్తు సమాచారం అందజేసి షెడ్యూలు అనుసరించి చేపడతామన్నారు. దీంతో ఓటరు లిస్టు, ఓటింగ్ శాతం పెరిగే అవకాశం ఉందని రాజకీయ ప్రతినిధులకు ఆయన వివరించారు.

హరితహారంపై ప్రత్యేక దృష్టి..!

ఈ ఏడాదిలో హరితహారం లక్ష్యం 63.90 లక్షల మొక్కలు

- జిల్లాలో ఇప్పటి వరకు నాటిన మొక్కలు 8 లక్షలు మాత్రమే
- నిర్లక్ష్యం చేసిన శాఖలు, పురపాలికలపై చర్యలకు సన్నద్ధం
- విస్తారంగా వర్షాలు.. మొక్కలు నాటడమే లక్ష్యంగా ముందడుగు



గ్రామీణ ప్రాంతాల్లో మొక్కలు నాటుతున్న మహిళలు

సాక్షి, మేడ్చల్ జిల్లా: నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో తొమ్మిదో విడత హరిత హారంలో మొక్కలు విరివిగా నాటేందుకు జిల్లా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. జిల్లాలో జీహెచ్‌ఎంసీ పరిధిలోని మున్సిపల్ సర్కిళ్లలో సహా పురపాలక సంఘాలు, గ్రామ పంచాయతీల్లో వీలైనన్ని మొక్కలు నాటేందుకు సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, పారిశ్రామిక ప్రాంతాలలో కూడా మొక్కలు నాటేందుకు కార్యాచరణ ఖరారు చేశారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఈ ఏడాది 63.90 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించారు. సామూహిక వనాల పెంపకానికి స్థల సేకరణలో ఆయా శాఖల అధికారులు నిమగ్నమయ్యారు.

నర్సరీల్లో 68 లక్షల మొక్కలు...

జిల్లాలో లక్ష్యానికి తగ్గట్టుగా అటవీ శాఖ తూముకుంట, కండ్లకోయ, దూలపల్లి ప్రాంతాల్లోని మూడు నర్సరీల్లో 8 లక్షల మొక్కలను పెంచగా, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ(డీఆర్డీఏ) ఆధ్వర్యంలో 59 గ్రామాల్లోని నర్సరీల్లో 30 లక్షల మొక్కలు, 13 పురపాలక సంఘాల పరిధిలోని నర్సరీల్లో మరో 30 లక్షల మొక్కలను పెంచారు. ఈ ఏడాది గతంలోని మొక్కలతో పాటు టేకు, ఈత, వెదురు, మలబార్, ఇప్ప, మద్ది, వెలగ, మర్రి, వేప, రేల, బాదాం, రావి, చింత, తులసి, నిమ్మ, జామ, సీతాఫలం, ఖర్జూర, మందార, సన్నజాజి, మల్లె నాటేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

నాటిన మొక్కలు 8 లక్షలకు పైనే...

మేడ్చల్ జిల్లాలో ఈ ఏడాది హరితహారంలో భాగంగా 63.90 లక్షల మొక్కలు నాటేందుకు లక్ష్యంగా అధికార యంత్రాంగం నిర్ణయించినా, ఇప్పటి వరకు 8,19,496 మొక్కలను మాత్రమే నాటారు. 61 గ్రామ పంచాయతీల్లో 12 లక్షల మొక్కల లక్ష్యంగా నిర్ణయించగా, ఇప్పటి వరకు 3,06,562 మొక్కలను నాటారు. హరితహారంలో లక్ష్యానికి అనుగుణంగా మొక్కలు నాటుతున్న వాటి జాబితాలో ఘట్కేసర్, కీసర, ఎంసీపల్లి, శామీర్‌పేట్, మేడ్చల్ మండలాల్లోని గ్రామ పంచాయతీలతోపాటు పరిశ్రమలు, మైనింగ్, అగ్రికల్చర్, మేడ్చల్ ఎక్సైజ్, అటవీ శాఖలు ఉన్నాయి. అలాగే.. పీర్జాదిగూడ, నిజాంపేట, మేడ్చల్, పోచారం, దుండిగల్, దమ్మాయిగూడ, కొంపెల్లి పురపాలక సంఘాల్లో కూడా మొక్కలు నాటుతున్నారు.

హరితహారంపై నిర్లక్ష్యంతో...

జిల్లాలో హరితహారంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఆయా ప్రభుత్వ శాఖలు, పురపాలక సంఘాలపై శాఖ పరమైన చర్యలకు జిల్లా అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. హరితహారంలో భాగంగా ఇప్పటి వరకు మొక్కలు నాటని జాబితాలో బోడుప్పల్, జవహర్‌నగర్, తూముకుంట, ఘట్కేసర్, నాగారం, గుండ్లపోచంపల్లి పురపాలక సంఘాలతో పాటు మల్కాజిగిరి ఎక్సైజ్‌శాఖ, స్కూల్, కాలేజీ ఎడ్యుకేషన్స్, హార్టికల్చర్, ఐసీడీఎస్, ఇరిగేషన్, మత్స్య, సంక్షేమ శాఖలు ఉన్నాయి.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

ఉప్పల్: ఉప్పల్ డివిజన్ లక్ష్మీనారాయణ కాలనీలో గురువారం నిర్వహించిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. రూ.10 లక్షల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు, తదితర అభివృద్ధి పనులకు అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు. నియోజకవర్గ పరిధిలో అన్ని డివిజన్లలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈఈ నాగేందర్, డీఈ నిఖిల్‌రెడ్డి, ఏఈ సాయికిరణ్, నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, సంద్రపల్లి వెంకటయ్య వేములు సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఉప్పల్ లక్ష్మీనారాయణ కాలనీలో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, అధికారులు

కాప్రాలో పారిశుద్ధ్య కార్మికుల ధర్నా



కాప్రా సర్కిల్ కార్యాలయం ఎదుట పారిశుద్ధ్య కార్మికుల ధర్నా

కాప్రా: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేటర్ కాప్రా సర్కిల్ కార్యాలయం ఎదుట గురువారం పారిశుద్ధ్య కార్మికులు పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. నూతనంగా వచ్చిన సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ముకుంద్‌రెడ్డి తమపై దురుసుగా ప్రవర్తిస్తున్నాడని ఆరోపిస్తూ కార్మికులు మెరుపు ధర్నాకు దిగారు. వారం రోజులుగా పారిశుద్ధ్య కార్మికులపై ఇష్టానుసారంగా మాట్లాడుతూ, సంబంధంలేని పనులు చెబుతూ వేధింపులకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. పారిశుద్ధ్యం విషయంలో తమ పరిధిలో విధుల కంటే ఇతర పనులు చెబితే ఎలా చేయాలని అన్నారు. కార్మికుల ధర్నాతో సర్కిల్ కార్యాలయం వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో కుషాయిగూడ పోలీసులు రంగంలోకి దిగారు. సీఐ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో కాప్రా సర్కిల్ కార్యాలయం వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యాలయానికి చేరుకున్న డీసీ ముకుంద్‌రెడ్డి క్షమాపణ కోరగా ధర్నా విరమించారు. పారిశుద్ధ్య కార్మికులు కుర్మన్న, బూరుగు మారుతిరావు, మిర్యాల సాయిలు, శంకర్ రావు, శ్రీను, ఆంజనేయులు, జంగయ్య, నర్సింహ, ఎల్లమ్మ, శోభ, కరుణ, పెంటమ్మ పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు అమృతం

అల్వాల్: అల్వాల్ సెక్టార్ గ్రేడ్–1 ఆధ్వర్యంలో గురువారం అల్వాల్‌లో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ప్రాజెక్టు నిర్వాహకులు భాగ్యలక్ష్మీ మాట్లాడుతూ బిడ్డ పుట్టగానే పుట్టిన వెంటనే బిడ్డకు కేవలం ముర్రుపాలు మాత్రమే పట్టాలన్నారు. తల్లిపాలతో బిడ్డకు కావాల్సిన పోషకాలు లభిస్తున్నాయన్నారు. తల్లిపాలు బిడ్డకు అమృతంలా పని చేస్తాయన్నారు.

22 మంది మాతృమూర్తులను సన్మానం

మల్కాజిగిరి: తల్లిపాలు పసిబిడ్డలకు ఎంతో మేలు చేస్తాయని సంఘ సేవకురాలు సుధ అన్నారు. గురువారం ఓల్డ్ మల్కాజిగిరి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా 22 మంది మాతృమూర్తులను సన్మానించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు ఆశాలత, ఏఎన్‌ఎం చంద్రకళ, ఆశా వర్కర్లు హేమలత, మాధవి, వసంత తదితరులు పాల్గొన్నారు.





నాలా స్థలం కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

ఉప్పల్: ఉప్పల్ పారిశ్రామికవాడలోని దేవేందర్‌నగర్ కాలనీ వద్ద ఉన్న నాలాను పూడ్చి ప్రైవేట్ వ్యక్తులు కబ్జా చేస్తున్నట్లు సమాచారం అందుకున్న ఉప్పల్ సర్కిల్ కాంగ్రెస్ పార్టీ ఎ– బ్లాక్ అధ్యక్షుడు మందుముల పరమేశ్వర్‌రెడ్డి గురువారం అడ్డుకున్నారు. వెంటనే అధికారులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న ఉప్పల్ సర్కిల్ ఈఈ నాగేందర్ పరిశీలించి కబ్జా చేస్తున్నట్లు ధ్రువీకరించారు. కాగా కబ్జాదారులకు ఉప్పల్ ఐలా అధికారులు అండగా నిలవడం శోచనీయమని కాలనీవాసులు ఆరోపించారు. ప్రభుత్వ స్థలాలను కాపాడాల్సిన అధికారులు, ప్రైవేట్ వ్యక్తులకు అమ్ముడుపోయి నాలాలను కబ్జా చేయించడం సరికాదని మండిపడ్డారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ నాలా స్థలం కబ్జా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను డిమాండ్ చేశారు. కాలనీవాసులు, ప్రతినిధులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.



ఉప్పల్ దేవేందర్‌నగర్‌లో నాలా వద్ద సర్కిల్ అధికారులు, పరమేశ్వర్‌రెడ్డి

మల్లాపూర్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా

మల్లాపూర్: డివిజన్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరించి ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దడమే తన ప్రధాన లక్ష్యమని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అన్నారు. గురువారం ఎస్వీనగర్ కాలనీలో సీసీ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలని సూచించారు. ఏఈ స్రవంతి, వర్క్ఇన్‌స్పెక్టర్ భిక్షపతి, కాలనీ అధ్యక్షులు నెమలి రవికుమార్, మోయిన్ పాషా, ప్రకాష్, మల్లేష్, రాపోలు శ్రీనువాస్ తదితరులు పాల్గొన్నారు.


బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి సమస్యలు పట్టవా?



ఈసీఐఎల్‌లో మాట్లాడుతున్న బాలమల్లేష్

కాప్రా: సమస్యలతో ప్రజలు కొట్టుమిట్టాడుతుంటే వాటి పరిష్కారానికి మాత్రం ప్రభుత్వ చొరవ చూపడంలేదని, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి సమస్యలు పట్టవా అని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎన్.బాలమల్లేష్ ప్రశ్నించారు. ఈసీఐఎల్‌లోని పార్టీ కార్యాలయం నీలం సంజీవరెడ్డి భవన్‌లో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ముందస్తు చర్యలు లేకపోవడంతోనే భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయని ఆరోపించారు. వరద నష్టం బాధితుల కోసం ప్రభుత్వం కేటాయించిన రూ.500 కోట్లు ఏ మూలకు సరిపోవని, తక్షణమే రూ.2 వేల కోట్లు విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. అర్హులైన పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలన్నారు. దమోదర్‌రెడ్డి, ఉమామహేష్, శంకర్‌రావు, దశరథ్, లక్ష్మీ, కృష్ణమూర్తి, కిషన్, ధర్మేంద్ర తదితరులు పాల్గొన్నారు.


ఏంకొనేటట్లు లేదు.. ఏం తినేటట్లు లేదు



మాట్లాడుతున్న మాధవి

మేడిపల్లి: మేడ్చల్ జిల్లా మేడిపల్లి మండల పీర్జాదిగూడ కార్పొరేషన్ పరిధిలో ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ కౌన్సిల్ సమావేశం మాధవి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి మాట్లాడుతూ.. అన్ని వస్తువుల ధరలు భగ్గుమంటున్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరలను నియంత్రించడంలో విఫలం అయ్యాయని అన్నారు. రైతులు పండించిన కూరగాయలకు శీతల గిడ్డంగులు ఏర్పాటు చేయడంలో పూర్తిగా విఫలమయ్యాయని ధ్వజమెత్తారు. జిల్లా కార్యదర్శి సాయిలుగౌడ్, మండల కార్యదర్శి రచ్చ కిషన్, జే.లక్ష్మి, జ్యోతి, మహేశ్వరి, ప్రమీళ, నర్సమ్మ, విజయ, సైదమ్మ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో పారిశుద్ధ్య కార్మికుడి మృతి



కాప్రా: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కాప్రా సర్కిల్‌లో పారిశుద్ధ్య జవాన్ దాసు గుండెపోటుతో మృతి చెందారు. ఉదయం సర్కిల్ కార్యాలయంలో చేపట్టిన పారిశుద్ధ్య కార్మికుల ధర్నాలో జవాన్ దాస్ పాల్గొన్నాడని, తిరిగి ఇంటికి చేరుకోగా గుండెపోటుతో మృతి చెందినట్లు తోటి పారిశుద్ధ్య కార్మికులు చెబుతున్నారు.

జూనియర్ డాక్టర్లకు బీసీ సంఘం సంఘీభావం



రామంతాపూర్: కొన్ని రోజులుగా స్టైఫండ్ పెంచాలని కోరుతూ రామంతాపూర్‌లోని ప్రభుత్వ హోమియోపతి మెడికల్ కళాశాల జూనియర్ డాక్టర్లు చేస్తున్న ఆందోళనకు గురువారం బీసీ సంక్షేమ సంఘం ఉప్పల్ కన్వీనర్ గడ్డం సాయికిరణ్ ఆందోళన శిబిరాన్ని సందర్శించి తమ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉన్నత న్యాయస్థానం స్టైఫండ్ పెంచాలని ఆదేశాలు జారీ చేసినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దురదృష్టకరమని వెంటనే స్టైఫండ్ పెంచాలని, లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనకు దిగుతామని ఆయన హెచ్చరించారు. బీసీ సంఘం నేతలు రాఘవేంద్ర, రాంబాబు, కార్తీక్, అరవింద్, రవీందర్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

బోర్‌వెల్ పనులు ప్రారంభం

మల్లాపూర్: నాచారం సీడీఎస్ బిల్డింగ్ ఆవరణలో గురువారం బోర్‌వెల్ పనులను జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు మినిస్ట్రీ ఆఫ్ జల్‌శక్తి డిపార్ట్‌మెంట్ ఆఫ్ వాటర్ రీసెర్చ్ హైడ్రో జియోలజిస్ట్ వారి పరిశోధన నిమిత్తం ఈ బోర్‌ను వేస్తున్నట్లు చెప్పారు. ప్రతి 3 నెలలకు ఒక్కసారి గ్రౌండ్ వాటర్‌ను పరిశోధన చేయనున్నారు. వాటర్ లెవల్, కలుషిత నీటిని జియోలజిస్ట్‌లు పరిశోధన చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, అంజయ్యగౌడ్, రమేష్‌గౌడ్, సంజీవ, ఎస్.రాజు, బీఆర్‌ఎస్ నేతలు డివిజన్ అధ్యక్షులు మేకల ముత్యంరెడ్డి, విఠల్ యాదవ్, అంజి, దాసరి కర్ణ, రాంచందర్, కట్ట బుచ్చన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



బోర్‌వెల్ పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్

మహిళా సాధికారితకు ప్రాధాన్యం

మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్



కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తూ..

రామంతాపూర్: ఓల్డ్ రామంతాపూర్‌లోని అంబేడ్కర్ సేవా సంఘం భవనంలో రైస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సౌజన్యంతో మహిళలకు ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ శిబిరాన్ని గురువారం మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్‌ఎస్ ప్రభాకర్, కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని బీజేపీ కేంద్ర ప్రభుత్వం దేశంలోని మహిళలందరూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని వారి సాధికారితకు ప్రాధాన్యం ఇస్తూ మహిళా స్వయం ఉపాధికి వడ్డీలు లేని రుణాలు అందజేస్తూ పలు పథకాలు అమలు చేస్తోందన్నారు. కార్పొరేటర్ శ్రీవాణి, స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు అమరేందర్‌గౌడ్, బీజేపీ రాష్ట్ర ఓబీసీ అధికార ప్రతినిధి వేముల కొండ సోమశేఖర్‌గౌడ్, జంగయ్య, రేవు నరసింహ, దాస్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని బలోపేతం చేద్దాం



మల్కాజిగిరి: బీజేపీని బలోపేతం చేద్దామని మాజీ ఎమ్మెల్యే ఆకుల రాజేందర్ అన్నారు. గురువారం మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్, నాయకులు లక్ష్మణ్‌గౌడ్, వాశంశెట్టి శ్రీనివాస్, విఠోబా, గణేష్ బీజేపీ పార్టీలో చేరిన సందర్భంగా ఆయనను కలిశారు. కౌన్సిలర్‌గా, నియోజవర్గం ఏర్పడిన తర్వాత ఎమ్మెల్యేగా ప్రజలకు సేవ చేశాని, మోడీ నాయకత్వంలో పనిచేయడానికి పార్టీలో చేరానన్నారు. స్థానిక నాయకులతో కలిసి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో రైతన్నకు భరోసా

మేడిపల్లి: దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో రైతు సంక్షేమం కొనసాగుతోందని, అన్నదాతలను ఆదుకోవడమే సీఎం కేసీఆర్ లక్ష్యమని పీర్జాదిగూడ మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో రైతు రుణ మాఫీ పునఃప్రారంభించినట్లు ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో గురువారం మేడిపల్లిలోని బీఆర్‌ఎస్ కార్యాలయం వద్ద పలువురు రైతులు, నాయకులతో కలిసి కేసీఆర్, కేటీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.



'సమస్యల పరిష్కారంలో బీఆర్‌ఎస్ విఫలం'



మల్లికార్జునగర్‌లో ప్రచారం చేస్తున్న డీసీసీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్

గౌతంనగర్: సమస్యల పరిష్కారంలో అధికార పార్టీ పూర్తిగా విఫలమైందని కాంగ్రెస్ పార్టీ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ అన్నారు. కాలనీ నేస్తం– కాంగ్రెస్ హస్తం కార్యక్రమంలో భాగంగా గురువారం గౌతంనగర్ డివిజన్ పరిధిలోని మల్లికార్జునగర్ తదితర ప్రాంతాల్లో పాదయాత్ర నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఇంటింటికీ తిరుగుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మల్కాజిగిరి బి బ్లాక్ అధ్యక్షులు వెంకటేష్‌యాదవ్, డివిజన్ అధ్యక్షులు ప్రవీణ్, మైనార్టీ అధ్యక్షులు షేక్, సతీష్, హరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరిస్తా

కాప్రా: ఆటో కార్మికులు, యూనియన్ సమస్యలు తన శాయశక్తుల ప్రయత్నిస్తానని బీఎల్‌ఆర్ ట్రస్ట్ చైర్మన్ బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. గురువారం సైనిక్‌పురిలోని తన కార్యాలయంలో ఆటో యూనియన్ సభ్యులు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. బీఎల్‌ఆర్ ప్రతినిధులు శేఖర్, ఆటో యూనియన్ సభ్యులు యాదగిరి, రఫిక్, మల్లేష్, తిరుపతి, వెంకటేశ్, శివ, శంకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సైనిక్‌పురిలో బండారి లక్ష్మారెడ్డితో ఆటో యూనియన్ సభ్యులు

అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలి



వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

ఉప్పల్: హబ్సిగూడ పరిధిలో అక్రమ నిర్మాణాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఉప్పల్ సీపీఎం నాయకులు ఉప్పల్ సర్కిల్ డీసీ శ్రీనివాస్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. వీధి నంబర్–18, రోడ్డు నంబర్ 01లో రోడ్డును పూర్తిగా ఆక్రమించి గేటు ఏర్పాటు చేసుకున్నారని, ఇంటి యాజమానిపై చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో కోరారు. స్పందించిన డీసీ విచారించి చర్యలు తీసుకుంటామి హామీ ఇచ్చినట్లు తెలిపారు. వినోద, వెంకన్న, నాగరాజు, ఎర్రం శ్రీనివాస్, పెద్ది శ్రీనివాస్, బీష్మాచారి తదితరులు పాల్గొన్నారు.